RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

1st Year Happy Work Anniversary.

Good for Health

Best for Readers

సంపుటి : 2 సంచిక : 187 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 01 జూన్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 187 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 01 June 2025 PAGES : 8 PRICE : 3/-

# మాది పేదల ప్రభుత్వం

## ఏపీ సీఎం చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 31)

పేదవాడికి సహాయం చేస్తే వచ్చే సంతోషం ఏ పనిలోనూ ఉండదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పింఛన్లు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటింటికి వెళ్లి అందిస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి అందించేలా చర్యలు చేపట్టామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా చెయ్యేరులో సీఎం పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడారు.

"ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే పింఛను మొత్తాన్ని పెంచాం. పేదవాడి కోసం పింఛన్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది ఎన్టీఆర్. ప్రజల ఆదాయం పెంచి అన్ని విధాలుగా ఆదుకుంటాం. అధిక పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. మాది పేదల ప్రభుత్వం. మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నాం. ఉచితంగా మూడు వంటగ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నాం. పేదలకు మూడుపూటలా అన్నం పెట్టాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. ప్రభుత్వ యంత్రాంగం పేదల గురించే ఆలోచించాలి. ప్రతి గ్రామానికీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక నేతలు వెళ్లాలి. పింఛను ఇచ్చే కార్యక్రమంలో భాగస్వాములైతే సమస్యలు తెలుస్తాయి. పేదల కోసం కష్టపడుతున్నాం. చేప ఇవ్వడమే కాదు.. పట్టిచ్చే విధానం నేర్పుతాం. భర్త చనిపోతే ఆటోమేటిక్‌గా భార్యకు పింఛను ఇచ్చే వెసులుబాటును తీసుకొచ్చాం. మూడునెలల వరకు పింఛను తీసుకునే వెసులుబాటు కల్పించాం. భర్త చనిపోతే భార్య అనాథగా మిగిలిపోకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నాం. వెనుకబడిన వర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది. బీసీల అభ్యున్నతి కోసం నిరంతరం పని చేస్తున్నాం. బీసీలకు సోలార్ ద్వారా ఉచితంగా ఇళ్లకు కరెంట్ ఇస్తాం. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేస్తాం. 98 వేల సబ్సిడీతో బీసీలకు, అగ్రవర్ణాలకు రూ. 75 వేల సబ్సిడీ ఇస్తాం. బడులు తెరిచే లోపల 'అమ్మకు వందనం' పథకం కింద రూ. 15వేల చొప్పున ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఇస్తాం. పాపులేషన్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా సంతానం పెంచుకోవాలి. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది.. యువత క్రమంగా తగ్గిపోతోంది. ప్రజల ఆదాయం పెరగాలని కోరుకుంటున్నా. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న సూపర్ సిక్స్‌లో ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. ఎవరికీ ఏ సమస్య లేకుండా అవినీతి రహితంగా పాలన సాగిస్తున్నాం. మీ ప్రభుత్వాన్ని మీరే కాపాడుకోవాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు." అని చంద్రబాబు వివరించారు.

## భారత నారీశక్తిని సవాల్ చేసిన ఉగ్రవాదులు మట్టిలో కలిశారు



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 31)

పహల్గాంలో దాడికి పాల్పడి.. భారత నారీశక్తికి సవాల్ విసిరి.. ఉగ్రవాదులు వారి వినాశనాన్ని వారే కొనితెచ్చుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రదాడికి ప్రతీకారంగా..'ఆపరేషన్ సిందూర్' లో పలువురు మహిళా అధికారిణులు పాల్గొని ఉగ్రవాదుల ఆచూకీ గల్లంతు చేశారని కీర్తించారు. రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా భోపాల్‌లో నిర్వహించిన 'మహిళా స్వశక్తికరణ్ మహా సమ్మేళన్'లో పాల్గొన్న ప్రధాని మాట్లాడుతూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులే కాదు.. వారిని పోషించేవారు కూడా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ ప్రపంచానికి చాటి చెప్పిందని ప్రధాని పేర్కొన్నారు. ఆ సమయంలో భారత కుమార్తెల బలాన్ని ప్రపంచం మొత్తం చూసిందన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాలపై పాక్ దాడులు చేసినప్పుడు అసిస్టెంట్ కమాండెంట్ నేహా భండారి నేతృత్వంలోని మహిళా బీఎస్ఎఫ్ బృందం మూడు రోజుల పాటు అఖ్నూర్‌లోని తమ ఫార్వర్డ్ పోస్టులపై పోరాడారని కీర్తించారు.

"మన సంప్రదాయంలో 'సిందూర్'.. 'నారీశక్తి'కి చిహ్నం. పహల్గాంలో, ఉగ్రవాదులు కేవలం మన పౌరుల రక్తం మాత్రమే కళ్ల చూడలేదు. మన సంస్కృతిపై దాడి చేశారు. మన సమాజాన్ని విభజించడానికి ప్రయత్నించారు. ఉగ్రవాదులు భారత నారీశక్తికి విసిరిన సవాలే వారి పాలిట, వారిని పోషిస్తున్న వారి పాలిట -మిగతా 2లో

## జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే సరుకులు

- జూన్ 1 నుంచి పేదలకు రేషన్ దుకాణాల్లోనే నిత్యావసరాలు
- ప్రతినెలా 1 నుంచి 15 వరకు సరుకుల పంపిణీ
- ఉదయం 8-12, సాయంత్రం 4-8 వరకు షాపులు తెరిచే ఉంటాయి
- దివ్యాంగులు, వృద్ధులకు ఇంటివద్దకే రేషన్ అందించే సౌకర్యం
- గత ప్రభుత్వ ఇంటింటి రేషన్ విధానంపై పవన్ విమర్శలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 31)

రాష్ట్రంలోని పేద కుటుంబాలకు జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారానే నిత్యావసర సరుకులను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఇకపై ప్రతినెలా ఒకటో తేదీ నుంచి పదిహేనో తేదీ వరకు చౌక ధరల దుకాణాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. ఈ దుకాణాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటాయని పవన్ వివరించారు. గత ప్రభుత్వం పేదలకు రేషన్ సరుకులు అందించే చౌకధరల దుకాణాలను మూసివేసిందని పవన్ విమర్శించారు. "ఇంటింటికీ సరుకులు అందిస్తామని చెప్పి, రూ. 1,600 కోట్లతో వాహనాలు కొనుగోలు చేశారు. అయితే, ఇంటింటికీ ఇవ్వడం మానేసి, నెలలో ఒకటి రెండు రోజులు మాత్రమే ప్రధాన కూడళ్లలో వాహనాలు నిలిపి సరుకులు పంపిణీ చేయడంతో ఎంతో మంది పేదలు ఇబ్బందులు పడ్డారు" అని ఆయన అన్నారు. రేషన్ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక రోజువారీ పనులు మానుకోవాల్సి వచ్చిందని, చిరుద్యోగాలు చేసుకునేవారు సెలవులు పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన -మిగతా 2లో

## పాక్ నోట చర్చలు.. అవన్నీ బూటకమే - ఎంజే అక్బర్



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 31)

విదేశాంగశాఖ మాజీ సహాయ మంత్రి ఎంజే అక్బర్ పాకిస్థాన్ (%ఆబిదిరిరీశిబిదీ%)పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పాక్‌ను సర్పంతో పోల్చిన ఆయన.. అబద్ధాలతో కాలం గడిపే, కపటనీతి కలిగిన దేశంతో చర్చలు జరపడం కష్టమేనన్నారు. దాయాది దేశంతో చర్చలు జరపవచ్చుకదా? అంటూ కొందరు చేస్తున్న వాదనకు బదులిస్తూ.. దానికి వెనక లాజిక్ ఏంటని ప్రశ్నించారు. భాజపా ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలో విదేశాల్లో పర్యటిస్తున్న విపక్ష బృందంలో ఉన్న అక్బర్.. కోపెన్‌హాగన్‌లో ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పాక్‌పై నిప్పులు చెరిగారు. "పాకిస్థాన్‌తో భారత్ ఎందుకు చర్చలు జరపదని కొందరు మిత్రులు అడుగుతున్నారు. అక్కడ చిత్తశుద్ధిలేని ప్రభుత్వం ఉంది. ఎవరితో చర్చలు జరపాలి? అక్కడ వాగ్దానాలను ఉల్లంఘించే ప్రభుత్వం ఉంది. ఎవరితో మాట్లాడాలి? విషపు నాలుక కలిగిన ప్రభుత్వం అది.. దానివల్ల ఎవరికి నష్టం?" అని అక్బర్ ప్రశ్నించారు. సర్పం ఎన్నడూ తన విషంతో చనిపోదన్న విషయాన్ని గుర్తుచేశారు. దేశంలో దీర్ఘకాలంగా అశాంతికి పాకిస్థాన్ ప్రధాన కారణమని మాజీ మంత్రి పేర్కొన్నారు. ఓ సాకుగా మారిన -మిగతా 2లో

## దేశంలో 2 వేలు దాటిన కొవిడ్ కేసులు



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 31)

దేశంలో మళ్లీ కొవిడ్ కేసులు కలకలం రేపుతున్నాయి. దేశంలో మొత్తం 2,710 యాక్టివ్ కేసులు నమోదైనట్లు ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. గత వారం రోజులుగా కేరళ, మహారాష్ట్ర, దిల్లీ, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక వంటి పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతున్నట్లు పేర్కొన్నారు. కేరళలో అత్యధిక కేసులు వస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర, దిల్లీ తరువాత స్థానంలో ఉన్నాయి. నాలుగు రోజుల్లోనే కేసులు వేగంగా పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. దేశంలో మే 26న మొత్తం 1,010 కేసులు నమోదవగా.. మే 30 నాటికి మొత్తం 2,710కు పెరిగినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ వెల్లడించింది. కరోనా కొత్త వేరియంట్లపై భయాందోళనలు అవసరం లేదని.. ఇన్ఫెక్షన్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. -మిగతా 2లో

## అణచివేతతో వైసీపీ మరింత బలోపేతం

సజ్జల రామకృష్ణారెడ్డి ధీమా

చంద్రబాబు ప్రభుత్వంపై సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర ఆరోపణలు

ఏపీలో 'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలవుతోందని విమర్శ

వైసీపీ నేతలను తప్పుడు కేసులతో వేధిస్తున్నారని ఆక్షేపణ

పోలీసు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆవేదన

ప్రభుత్వ చర్యలతో వైసీపీ మరింత బలపడుతుందని వ్యాఖ్య

అరాచక పాలన ఎక్కువ కాలం సాగదని హెచ్చరిక



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 31)

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 'రెడ్ బుక్ రాజ్యాంగం' పేరుతో ఒక నూతన అప్రజాస్వామిక పాలన సాగిస్తోందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వ్యవస్థలను పూర్తిగా భ్రష్టు -మిగతా 2లో

## మహానాడు పెద్ద డ్రామా

పెన్షన్ల పెంపు తప్ప హామీలు నెరవేర్చలేదని బొత్స ఆరోపణ

గతేడాది "తల్లికి వందనం" పథకాన్ని ఎగ్గొట్టారని ధ్వజం

టెన్త్ వాల్యుయేషన్‌లో ప్రభుత్వ వైఫల్యం స్పష్టమయిందన్న బొత్స



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 31)

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తున్నా, పెన్షన్ల పెంపు మినహా ప్రజలకు ఇచ్చిన హామీలలో వేటిని నెరవేర్చారో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈరోజు వైజాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బొత్స -మిగతా 2లో

## 21 రోజుల్లో 11 సార్లు ట్రంప్ నోట అదే మాట.. మోదీ స్పందనేదీ?: జైరాం రమేశ

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 31)

భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలను తానే తగ్గించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ప్రకటించుకుంటున్న సంగతి తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీని కొన్ని రోజులుగా ప్రశ్నిస్తోంది. ద్వైపాక్షిక ఒప్పందం ద్వారా మాత్రమే కాల్పుల విరమణ జరిగిందని ప్రధాని ఎందుకు చెప్పలేకపోతున్నారని మరోసారి అడిగింది. "21 రోజుల్లో ఇది 11వ సారి. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించానంటూ ట్రంప్ పదేపదే ఒకే విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. రెండు అణ్వస్త్ర దేశాల మధ్య ఘర్షణలు తగ్గించడానికి తాము జోక్యం చేసుకున్నామని, వాణిజ్యాన్ని ఒక సాధనంగా వాడామని చెప్తున్నారు. చివరికి కోర్టులోనూ అదే వాదన. కానీ ట్రంప్ ప్రకటనలపై స్నేహితుడు నరేంద్రమోదీ పూర్తిగా మౌనం వహిస్తున్నారు. ఆయన ఎందుకు మాట్లాడటం లేదు..?" అని ఎక్స్ వేదికగా హస్తం సీనియర్ నేత జైరాం రమేశ్ పోస్టు పెట్టారు. "భారత్- పాక్‌ల మధ్య కాల్పుల విరమణకు మా యంత్రాంగం మధ్యవర్తిత్వం వహించింది. వాణిజ్యం విషయంలోనూ మేం అండగా ఉన్నాం. 'ఉద్రిక్తతలకు ముగింపు పలికితేనే వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకుంటాం. లేకపోతే.. ఎటువంటి వాణిజ్యం చేయబోం' -మిగతా 2లో



## మద్యం ముడుపులు ఎవరికి చేర్చారు?

- ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టారు?
- మీ ద్వారానే అంతిమ లబ్ధిదారుకు వెళ్లినట్లు ఆధారాలున్నాయి
- మద్యం కుంభకోణంలో జగన్ సన్నిహితుల్ని ప్రశ్నించిన సిట్
- దర్యాప్తునకు సహకరించని ఆ నలుగురు
- తొలి రోజు 8 గంటలపాటు విచారణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 31)



ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను సిట్ కార్యాలయానికి తరలిస్తున్న పోలీసులు

'మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి వసూలు చేసిన ముడుపుల సొత్తు మీ ద్వారానే అంతిమ లబ్ధిదారుకు చేరినట్లు స్పష్టమైన -మిగతా 2లో

## ఫలించిన భారత్ దౌత్యం.. పాక్ గురించి నిజాలు తెలుసుకున్న కొలంబియా

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 31)

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలపడంపై కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ అసహనం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే తమ సంతాప ప్రకటనను కొలంబియా వెనక్కి తీసుకుంది. ఉగ్రవాదంపై పాకిస్థాన్ అనుసరిస్తున్న విధానాన్ని ఎండగట్టేందుకు భారత పార్లమెంటరీ అఖిలపక్ష ప్రతినిధి బృందాలు పలు దేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. అందులోభాగంగా థరూర్ నేతృత్వంలోని బృందం కొలంబియాకు వెళ్లింది. ఈక్రమంలో ఆ దేశ విదేశాంగ శాఖ ఉప మంత్రి రోసా యెలాండ్ విల్లావిసెన్సియోతో థరూర్ భేటీ అయ్యారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ఆ తర్వాత -మిగతా 2లో



## మొదటి పేజీ తరువాయి

## భారత నారీశక్తిని సవాల్ చేసిన ఉగ్రవాదులు మట్టిలో కలిశారు

శాపంగా మారింది. పాకిస్థాన్ సైన్యం కూడా ఊహించని ప్రాంతాల్లో ఉగ్రవాద శిబిరాలపై మన సాయుధ దళాలు దాడులు చేశాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం చేపట్టిన ఈ ఆపరేషన్ భారత చరిత్రలోనే అతిపెద్ద విజయం" అని ప్రధాని వ్యాఖ్యానించారు.భోపాల్‌లో నిర్వహించిన 'మహిళా స్వశక్తికరణ్ మహా సమ్మేళన్'లో పాల్గొన్న ప్రధాని మోదీ ఇండోర్ మెట్రో, దాటియా, సత్నా విమానాశ్రయాల సూపర్ ప్రియారిటీ కారిడార్లను వర్చువల్‌గా ప్రారంభించారు. వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రూ.483 కోట్లతో నిర్మించిన కొత్త అటల్ గ్రామ సేవా సదన్ (పంచాయత్ భవన్)లకు ఇవ్వాల్సిన మొదటివిడత మొత్తాన్ని మోదీ బదిలీ చేశారు. 18వ శతాబ్దానికి చెందిన మాల్వాలోని హోల్కర్ రాజవంశానికి చెందిన రాణి అహల్యాబాయి అసాధారణ పాలన, సామాజిక సంక్షేమంపై నిబద్ధతను కొనియాడారు. రాణి అహల్యాబాయికి అంకితం చేసిన పోస్టల్ స్టాంప్, రూ.300 స్మారక నాణాన్ని ప్రధాని విడుదల చేశారు.

## పాక్ నోట చర్చలు.. అవన్నీ బూటకమే - ఎంజే అక్బర్

విషయాలపై చర్చల కోసం భారత్ తన సమయాన్ని వృథా చేసుకోదని స్పష్టం చేశారు. చర్చల కాలాన్ని దాయాది దేశం మరో ఉగ్రదాడికి ఉపయోగించుకుంటుందని మండిపడ్డారు. పాక్ నోట చర్చలు అనేవి బూటకపు మాటలు తప్ప మరేమీ లేదన్నారు. అవసరమైన విషయాలపై చర్చలు జరుపుతామని, అవి కూడా పీవోకేని తిరిగి తీసుకునే విషయంపైనేనని స్పష్టం చేశారు.

## జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే సరుకులు

ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన రేషన్ బియ్యం, ఇతర సరుకులను అక్రమంగా తరలిస్తున్న విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపిందని పవన్ తెలిపారు. ఈ విచారణలో భాగంగా వేలాది టన్నుల అక్రమ బియ్యాన్ని కాకినాడ, విశాఖపట్నం ఓడరేవుల్లో పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇటువంటి అక్రమాలను అరికట్టేందుకే, తిరిగి చౌకధరల దుకాణాల ద్వారానే పేదలకు నిత్యావసరాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ కొత్త విధానంలో భాగంగా, దివ్యాంగులు మరియు 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు వారి ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించే సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పేద ప్రజలకు సక్రమంగా, సకాలంలో నిత్యావసరాలు అందేలా చూడటమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆయన పునరుద్ఘాటించారు.

## దేశంలో 2 వేలు దాటిన కొవిడ్ కేసులు

**రాష్ట్రాల వారీగా కొవిడ్ కేసులు ఇలా..**

డేటాబోర్డులో వెల్లడించిన సమాచారం ప్రకారం.. దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 2,710గా ఉండగా, కేరళలో అత్యధికంగా 1,147 కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలో 424, ఢిల్లీలో 294, గుజరాత్‌లో 223, తమిళనాడులో 148, కర్ణాటకలో 148, పశ్చిమబెంగాల్‌లో 116, రాజస్థాన్‌లో 51 కేసులు, ఉత్తరప్రదేశ్‌లో 42, పుదుచ్చేరిలో 25, హరియాణాలో 20, ఆంధ్రప్రదేశ్‌లో 16, మధ్యప్రదేశ్‌లో 10, గోవాలో 7, ఒడిశా, పంజాబ్, జమ్మూకశ్మీర్‌లలో ఒక్కో రాష్ట్రంలో నాలుగు చొప్పున కేసులు నమోదయ్యాయి. తెలంగాణ, అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్ రాష్ట్రాలలో ఒక్కో రాష్ట్రంలో మూడు కేసులు నమోదవగా.. మిజోరం, అస్సాంలలో చెరో ఇద్దరు ఈ ఇన్ఫెక్షన్ బారిన పడినట్లు తెలుస్తోంది.

## 21 రోజుల్లో 11 సార్లు ట్రంప్ నోట అదే మాట.. మోదీ స్పందనేదీ?: జైరాం రమేశ్

అని స్పష్టంచేశాం. దీంతో ఆ రెండు దేశాలు సానుకూలంగా స్పందించాయి" అని ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. దీన్ని భారత్ ఇప్పటికే ఖండించింది. 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతున్న సమయంలో ఆయా సందర్భాల్లో అమెరికా ప్రతినిధులతో భారత ప్రతినిధులు ఫోన్‌లో మాట్లాడారని.. ఎక్కడా కూడా వాణిజ్యం గురించి ప్రస్తావన రాలేదని స్పష్టం చేసింది. అంతకుముందు కాల్పుల విరమణపైనా ట్రంప్ తొలుత ప్రకటన చేయగా.. భారత్ మాత్రం ట్రంప్ పాత్రను అసలు ప్రస్తావించలేదు.

## అణచివేతతో వైసీపీ మరింత బలోపేతం

పట్టించి, ముఖ్యంగా పోలీసు యంత్రాంగాన్ని అదుపులో పెట్టుకుని ప్రతిపక్ష నేతలను, కార్యకర్తలను తప్పుడు కేసులతో వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు.శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలకు పాతర వేస్తున్నారని విమర్శించారు. "మేము వస్తే రెడ్ బుక్ రాజ్యాంగం ఉంటుంది, రెడ్ బుక్ పాలన ఉంటుంది అని ఎన్నికలకు ముందే ప్రకటించారు. అదేదో మాటలకే పరిమితం అనుకున్నాం, కానీ ఇప్పుడు దాని పర్యవసానాలు చూస్తున్నాం," అని సజ్జల అన్నారు. వైఎస్ఆర్సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిపై ఇటీవల నమోదు చేసిన కేసు ఈ కోవలోకే వస్తుందని ఆయన పేర్కొన్నారు.ఏదైనా కేసులో ఆధారాలుంటే ఎంతవరకైనా వెళ్లవచ్చని, కానీ ఏమీ లేకుండా కల్పిత కథలు సృష్టించి, పాత్రలను తయారుచేసి, వాటిని తమ అనుకూల మీడియాలో రోజుల తరబడి ప్రచారం చేసి, ఆ తర్వాత వ్యక్తులను అరెస్టు చేసి కన్ఫెషన్లు రాయించుకుంటున్నారని సజ్జల ఆరోపించారు. "పదేళ్ల క్రితం నాటి సంఘటనలను కూడా ఇప్పుడు తవ్వి తీసి, విష ప్రచారంతో ప్రజల మెదళ్లలోకి ఎక్కించి, కేసులు బనాయించి జైల్లో పెడుతున్నారు. ఇది సోషల్ మీడియా కార్యకర్తలతో మొదలై, నాయకుల వరకు పాకింది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విధమైన అణచివేత చర్యల వల్ల నాయకులు, కార్యకర్తలు మరింత గట్టిగా తయారై వస్తున్నారని, వైఎస్ఆర్సీపీ మరింత బలపడుతుందని సజ్జల ధీమా వ్యక్తం చేశారు. "ఒక నెల, రెండు నెలలు నాయకులను జైల్లో పెట్టొచ్చు. కానీ వారు బయటకు వచ్చేసరికి మరింత దృఢంగా మారుతున్నారు" అని తెలిపారు. పోలీసు వ్యవస్థ ఒకసారి గాడి తప్పితే, దానిని మళ్లీ దారికి తీసుకురావడం చాలా కష్టమని, ప్రస్తుతం రాష్ట్రంలో అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయని అన్నారు. తెనాలిలో జరిగిన ఘటనను, కావలి ప్రాంతంలో బహిరంగంగా అసభ్య నృత్యాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడాన్ని ఆయన ఉదహరించారు. "ఖాకీ డ్రెస్సులో గూండాయిజం కళ్ళ ముందు కనపడుతుంది. అధికారులు కొందరు ప్రభుత్వానికి తాబేదారులుగా మారి ఈ అరాచకాలకు సహకరిస్తున్నారు," అని సజ్జల దుయ్యబట్టారు.

చంద్రబాబు నాయుడు ఈరోజు నాటుతున్న విత్తనాల వల్ల భవిష్యత్తులో భయంకరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గ్రహించడం లేదని సజ్జల హెచ్చరించారు. "ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను నొక్కేందుకే ఈ టెర్రర్ క్రియేట్ చేస్తున్నారు. ఈ అరాచకాల మాటున దోపిడీ భయంకరంగా సాగుతోంది" అని ఆరోపించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి వంటి సీనియర్ నాయకులపై గురి పెట్టడం ద్వారా పార్టీని బలహీనం చేయాలని చూస్తున్నారని, అది అసాధ్యమని అన్నారు. "జగన్మోహన్ రెడ్డి గారి లాంటి పట్టుదల, పటిమ ఉన్న నాయకుడిని, వైఎస్ఆర్సీపీ లాంటి పార్టీని ఎవరూ ఏమీ చేయలేరు. ఈ చర్యల వల్ల పార్టీ మరింత బలపడుతుంది. అందుకు చంద్రబాబు నాయుడికి ధన్యవాదాలు" అని సజ్జల వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వ హయాంలో ఎవరిపైనైనా కేసులు పెడితే, పూర్తిస్థాయి దర్యాప్తు చేసి, ఆధారాలు లభించిన తర్వాతే చర్యలు తీసుకున్నామని సజ్జల గుర్తుచేశారు. చంద్రబాబు నాయుడిని అరెస్టు చేసినప్పుడు కూడా ఇదే విధానాన్ని అనుసరించామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం మాత్రం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఎలాంటి ఆధారాలు లేకుండానే కేసులు బనాయిస్తోందని విమర్శించారు. "కాకాణి గోవర్ధన్ రెడ్డిపై మొదట బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, ఆ తర్వాత అవి నిలబడవని తెలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పేలుడు పదార్థాల చట్టం వంటి కఠినమైన సెక్షన్లను జోడించారు" అని ఆరోపించారు. ఒక కేసులో బెయిల్ వచ్చినా, మరో కేసు పెట్టి జైల్లోనే ఉంచేందుకు పీటీ వారెంట్లు ప్రయోగిస్తున్నారని, నందిగం సురేశ్ విషయంలో ఇలాగే జరిగిందని తెలిపారు.ఈ విధమైన అప్రజాస్వామిక పోకడలు ఎక్కువ కాలం సాగవని, ప్రజలు ఇప్పటికే ఈ ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని సజ్జల అన్నారు. "ఒక పవర్ఫుల్ రాజకీయ పార్టీ నేతలనే ఇంత సులువుగా వేధించగలిగితే, ఇక సామాన్యులు, జర్నలిస్టులు, తమ గొంతు విప్పాలనుకునే వారి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి. ఇది చాలా దారుణం," అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి, వ్యవస్థలను గాడిలో పెట్టకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సజ్జల రామకృష్ణారెడ్డి హెచ్చరించారు.

## మద్యం ముడుపులు ఎవరికి చేర్చారు?

ఆధారాలున్నాయి. ఈ సొత్తంతా ఏయే మార్గాల్లో చేర్చారు? ఆ సొత్తుతో ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టారు?' అంటూ సిట్ అధికారులు మద్యం కుంభకోణంలో కీలక నిందితులైన ఆ నలుగుర్ని సుదీర్ఘంగా ప్రశ్నించారు. మాజీ సీఎం జగన్‌కు సన్నిహితులైన సీఎంవో మాజీ కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ, ఐటీ శాఖ మాజీ సలహాదారు రాజ్ కెసిరెడ్డిలను సిట్ అధికారులు రెండు రోజుల కస్టడీకి తీసుకున్నారు. తొలి రోజు శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు దాదాపు 8 గంటల పాటు ఒక్కొక్కర్నీ వందకు పైగా ప్రశ్నలు అడిగారు. తొలుత నలుగుర్ని వేర్వేరుగా ప్రశ్నించారు. వారి జవాబులన్నీ క్రోడీకరించి మిగతా వారితో క్రాస్ వెరిఫికేషన్ చేసుకున్నారు. నలుగురి సమాధానాలకు పొంతన లేకపోవటంతో ఒకేసారి అందర్నీ కలిపి ప్రశ్నించారు. అయినా దర్యాప్తునకు వారు సహకరించలేదు. తమకేమీ తెలియదని, మద్యం కుంభకోణంతో సంబంధం లేదని పదే పదే చెప్పారని సమాచారం. వీరి పాత్రపై సేకరించిన కీలక ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను చూపించి అధికారులు ప్రశ్నించగా మౌనం దాల్చినట్లు తెలిసింది.

## ఫలించిన భారత్ దౌత్యం.. పాక్ గురించి నిజాలు తెలుసుకున్న కొలంబియా

భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన పూర్తి విషయాలను ఆయన తెలియజేశారు. అనంతరం యెలాండ్ మీడియాతో మాట్లాడుతూ.. తమ ప్రకటనను వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. 'ఈ రోజు భారత బృందం మాకు అన్ని విషయాలను తెలియజేసింది. కశ్మీర్‌లో ఏం జరిగిందనేది పూర్తిగా తెలుసుకున్నాం. దాడులకు దారితీసిన పరిస్థితిపై అవగాహన వచ్చింది' అని పేర్కొన్నారు. ఈ ప్రకటన అనంతరం థరూర్ కొలంబియా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదంపై తమ వైఖరిని వారు పూర్తిగా తెలుసుకున్నారని థరూర్ తెలియజేశారు.

కొలంబియాకు పర్యటనకు వెళ్లిన థరూర్ అక్కడి మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. పాక్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ దాడి చేసిన తర్వాత అక్కడ మరణించిన వారికి కొలంబియా సంతాపం తెలపడంపై ఆయన అసహనం వ్యక్తంచేశారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా భారత్ అనేక ఉగ్రదాడులను భరించిందని తెలిపారు. పాకిస్థాన్ తన సైనిక పరికరాలను వారి రక్షణ కోసం కాకుండా.. పక్క దేశాలపై దాడి కోసం వినియోగిస్తోందని వివరించారు.

## మహానాడు పెద్ద డ్రామా

ఈ వ్యాఖ్యలు చేశారు. ఏడాది కాలంలో ప్రభుత్వం సాధించిన ప్రగతిని చెప్పుకోలేక, కడపలో మూడు రోజుల పాటు టీడీపీ మహానాడు పేరుతో ఒక డ్రామా ఆడారని బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. "పెన్షన్లు పెంచడం తప్ప, ఈ ఏడాది కాలంలో మీరు అమలు చేసిన ఒక్క హామీ అయినా ఉందా?" అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

గత ఏడాది "తల్లికి వందనం" పథకాన్ని ప్రభుత్వం ఎగ్గొట్టిందని బొత్స విమర్శించారు. విద్యా వ్యవస్థ నిర్వహణలో కూడా కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. పదో తరగతి పరీక్షల మూల్యాంకనంలో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతోందని అన్నారు. "మా ప్రభుత్వ హయాంలో 500 మందికి మించి విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు వెళ్లేవారు కాదు. కానీ, ఈ కూటమి ప్రభుత్వంలో ఏకంగా 1,650 మంది విద్యార్థులు రీవాల్యుయేషన్ చేయించుకున్నారు.

ప్రభుత్వ చర్యల వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది" అని బొత్స ఆవేదన వ్యక్తం చేశారు.మూల్యాంకన ప్రక్రియలో లోపాల గురించి మాట్లాడుతూ, "రోజుకు 40 జవాబు పత్రాలు దిద్దాల్సిన ఉపాధ్యాయులకు అంతకంటే ఎక్కువ ఇస్తే వాళ్లు మాత్రం ఏం చేయగలరు? ప్రతి పనికి ఒక ప్రణాళిక ఉండాలి. కానీ, కూటమి ప్రభుత్వం ఆ ప్రణాళికను అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతోంది" అని ఆయన ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి సరైన దిశానిర్దేశం లేదని, దీనివల్ల అన్ని రంగాల్లోనూ సమస్యలు తలెత్తుతున్నాయని బొత్స సత్యనారాయణ విమర్శించారు.

## ప్రాథమిక వైద్యశాలలో రికార్డులు తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 31)

స్థానిక ప్రాథమిక వైద్యశాలను శనివారం డి ఎంహెచ్ఓ డాక్టర్ టి వెంకటేశ్వర్లు వైద్యశాలలో రోగులు చికిత్స, వైద్య సిబ్బంది పనితీరు, మందులు సదుపాయాలు, రికార్డుల నిర్వహణ వంటి అంశాన్ని పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సీజనల్ వ్యాధిపై అవగాహన, రోగులకు డిజిటలైజేషన్ రికార్డుల గురించి, ప్రాథమిక వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఓపి సమయంలో వైద్యులు పూర్తి సమయం అందుబాటులో ఉండాలన్నారు. వైద్య సేవలపై నిర్లక్ష్యం చేయవద్దని, వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్లు రవి కిరణ్, కృష్ణ చైతన్య , వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 31)

యోగాను ఉద్యోగులు క్రమం తప్పకుండా సాధనచేస్తే శారీరక, మానసిక, భావోద్వేగ శ్రేయస్సును సాధించడానికి దోహదపడుతుందని కనిగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రజా రవాణా శాఖ ఉద్యోగులకు డిపో మేనేజర్ ఆధ్వర్యంలో యోగ గురువులు స్వర్ణ రమణయ్య యోగాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చునని ఉద్యోగులు యోగాను క్రమం తప్పకుండా సాధనచేయడం వల్ల హృదయ సంబంధ ఫిట్ నెస్ పెరగడం, వత్తిడిని నియత్రించుకోవడం,షుగర్ రక్తపోటు సాధారణీకరణ వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయన్నారు. యోగా అనేది మానసిక ఒత్తిడిని తగ్గించడానికి, ప్రశాంతతను సాధించడానికి ఒక మార్గమని ఇది శ్వాస, ధ్యానం, సున్నితమైన కదలికల ద్వారా మనస్సును శాంతపరచడానికి, ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుందని ప్రముఖ యోగ గురువులు ప్రభుత్వ ఉపాధ్యాయులు స్వర్ణ రమణయ్య యోగ ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా రవాణా ఉద్యోగులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగస్వాములు కావాలి

**ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి**





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

యోగాంధ్ర -2025 మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం ఒంగోలులోని జెడ్పీ సమావేశ మందిరంలో ఆయన యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా తన పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ యోగాంధ్ర క్యాంపెయిన్ లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుని యోగాంధ్ర -2025 మాసోత్సవాల్లో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, బిసి కార్పోరేషన్ ఈడి వెంకటేశ్వర రావు, సెట్నల్ సీఈఓ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటకేంద్రంగా రామలింగేశ్వరస్వామి ఆలయం

### రామలింగేశ్వరస్వామి గుడి, ఘాట్‌రోడ్డు పనులు పునఃప్రారంభించిన జీవీ, మక్కెన



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 31)





రాష్ట్రంలో పల్నాడు జిల్లా, వినుకొండకే ప్రత్యేక గుర్తింపుగా ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని మహాపుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రంగా కూడా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక ప్రజలతో పాటు అటు రాయలసీమ, ఇటు మిగిలిన రాష్ట్ర ప్రజలందరు దర్శించుకుని పూజలు చేసుకునే విధంగా సమష్టికృషితో ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే తన సంకల్పమని చెప్పారు. వినుకొండ రామలింగేశ్వరస్వామి దేవాలయం, ఘాట్ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు వినుకొండ ప్రజల ఇలవేల్పు కొండపైన వెలసిన రామలింగేశ్వరస్వామి అన్నారు. ఆ ఆలయ నిర్మాణాన్ని మళ్లీ పునఃప్రారంభించడం చాలా సంతోషకరమన్నారు. ఈ నిర్మాణ పనులను ప్రణాళికబద్ధంగా మాఘమాసం నాటికి పూర్తి చేయాలనే ఆకాంక్షతో కమిటీ సభ్యులందరికీ బాధ్యతలు అప్పగిస్తున్నామన్నారు. ఘాట్ రోడ్డు పనులు 25శాతమే మాత్రమే పూర్తయ్యాయని, ఇంకా 75 శాతం పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేశాక తారురోడ్డు, సైడ్ స్లోప్స్, రక్షణ గోడలు, కాల్వలు కూడా నిర్మిస్తామని తెలిపారు. భగవంతుడు, వినుకొండ ప్రజలు, చంద్రబాబు ఆశీస్సులతో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. రామలింగేశ్వరస్వామి కొండను అభివృద్ధి చేసేందుకు అడిగిన వెంటనే రూ.2 కోట్ల నిధులు ఇచ్చిన సీఎం చంద్రబాబుకు, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. ఈ అభివృద్ధిలో వినుకొండ పట్టణంతో పాటు 5మండలాల ప్రజలు సహాయ సహకారాలు అందించి చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. రామలింగేశ్వరస్వామి గుడికి పెద్ద చరిత్ర ఉందని, శ్రీరామచంద్రుడు ఈ రామలింగేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు ప్రసిద్ధని చెప్పారు. జటాయువు పక్షి శ్రీరాముడికి మొట్టమొదటగా సీతమ్మ వార్త జాడ చెప్పినటువంటి కొండ ఈ రామలింగేశ్వరస్వామి కొండని పేర్కొన్నారు. సీతమ్మ జాడ ఈ కొండపై విన్నారు కావున దీనికి వినకొండ అనే పేరు వచ్చిందని వెల్లడించారు. అందుకే ప్రభుత్వ సహకారంతో పాటు ప్రజలందరినీ భాగస్వామ్యులను చేస్తామని, ఆలయ నిర్మాణానికి, అభివృద్ధికి విస్తృతంగా విరాళాలు ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు అధికారులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వెలుగు
ePaper
www.shanmukhavelugu.com


షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



## సహ ఉద్యోగికి సమాచారశాఖ ఘన వీడ్కోలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

సమాచార శాఖలో సుమారు 38 ఏళ్లపాటు టైపిస్టుగా విధులు నిర్వహించి శనివారం ఉద్యోగ విరమణ చేసిన ఓ.ఇందిరా కుమారికి సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు ఘన వీడ్కోలు పలికారు. మార్కాపురం డివిజన్ కార్యాలయంతో పాటు (తరువాయి 4లో...)

# జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలి

## ప్రజా ప్రతినిధులు, అధికారులకు సూచించిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 31)

ప్రజల సంక్షేమం, జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. శనివారం ఆమె అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక దక్షిణ బైపాస్ రోడ్డు సెంటర్‌లోని జెడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. గ్రామీణ నీటి సరఫరా డ్వామా, డీఆర్‌డీఏ, విద్య, వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా అందుతున్న సేవలపై ఈ సమావేశంలో చర్చించారు. సమావేశంలో చట్టసభ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, జెడ్పీ సీఈవో చిరంజీవి, బాపట్ల, నెల్లూరు జిల్లాల డీఆర్వోలు గంగాధర్ గౌడ్, ఉదయ భాస్కర్ పాల్గొన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ కుమార్, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ హాజరై ఆయా శాఖలకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ బాలశంకర రావు మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. సాగర్ నీటితో అన్ని నీటి చెరువులను నింపుతున్నట్లు చెప్పారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్లు విడుదల చేసిందన్నారు. గుండ్లకమ్మ, రామతీర్థం, వెలిగండ్ల ప్రాజెక్ట్‌ల నుంచి జలజీవన్ పథకం కింద చేపట్టిన పనులు కొనసాగుతున్నట్లు చెప్పారు. ఈ పనులను కేంద్ర నోడల్ అధికారులు కూడా గురు, శుక్ర వారాలలో జిల్లాలో పర్యటించి పరిశీలించినట్లు చెప్పారు. డ్వామా పీడీ జోసఫ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరం లో ఇప్పటివరకు 54 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. జిల్లాలో పశువులకు నీటి తొట్టెలు, గోకులం షెడ్డులు, ఫారం పాండ్స్, సోక్ పిట్స్ నిర్మాణాల పురోగతిని, పూడికతీత పనుల వివరాలను వివరించారు. "పల్లె పండుగ" కార్యక్రమం కింద చేపట్టిన పనులకు బిల్లులు వారం రోజులలో చెల్లిస్తామని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ నారాయణ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఈ ఆర్థిక సంవత్సరం లో రుణాల మంజూరు లక్ష్యాన్ని, జిల్లాలో "లఖ్ పతి దీదీ"లుగా మహిళలను తీర్చి దిద్దేందుకు అమలు చేస్తున్న ప్రణాళికను వివరించారు. డీఈవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ స్కూల్స్ ప్రారంభించగానే "సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' కిట్లు అందించేందుకు చర్యలు తీసుకున్నామని, "మన బడి మన భవిష్యత్తు" కార్యక్రమం కింది పాఠశాలలలో అవసరమైన పనులు చేపడతామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ "అన్నదాత సుఖీ భవ" పథకం కింద లబ్దిదారుల ఖాతాలలో జూన్ 3 వ వారంలో ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందన్నారు. ఇటీవల వర్షాలకు పంటలు దెబ్బతిన్న ఉద్యాన రైతులకు ప్రభుత్వం తరఫున నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ రక్షిత మంచి నీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు సక్రమంగా పని చేసేలా పర్యవేక్షించాలని సూచించారు. అవసర మైతే వచ్చే రెండేళ్లలో 100 ఆర్వో ప్లాంట్లు వచ్చేలా తాను చూస్తానన్నారు. రక్షిత మంచి నీటిని సరఫరా చేసే పైపు లైన్ల మరమ్మతులు, కొత్త వాటికి ఎంపీ ల్యాడ్స్ నుంచి ఒక కోటి రూపాయలు ఇస్తానన్నారు. ఇప్పటికే సచివాలయాలకు తాను ఇచ్చిన 15 ట్యాంకర్లను స్వాధీనం చేసుకుని వినియోగించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. రాష్ట్రంలో జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేసే గడువును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి 2028 వరకు పెంచినందున ఈ పనులను వేగవంతం చేయాలని చెప్పారు. రైతుల వద్ద పొగాకు నిల్వలు భారీగా ఉన్నందున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. కొత్త జెడ్పీ సమావేశ మందిరం నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ కుమార్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో సీపీడబ్ల్యూఎస్ పథకాల నిర్వహణ పై మరింత దృష్టి పెట్టాలని అధికారులకు చెప్పారు. రామతీర్థం, గుండ్లకమ్మ కాలువలు బాగు చేయించాలని సూచించారు. సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. జూన్ నెలాఖరుకు పూర్తి చేయక పోతే నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం ఉండదన్నారు. దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు కలిగి, అడిగిన వారందరికీ ఎలాంటి పక్షపాతం లేకుండా పని కల్పించాలని అన్నారు. తన నియోజకవర్గంలో పంటలు నష్టపోయిన ఉద్యాన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని గురిజేపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు బొప్పాయి పంటను నష్ట పరిచారని, బాధిత రైతుకు పరిహారం అందేలా చూడాలని అధికారులను కోరారు. నియోజకవర్గ కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి నేరుగా బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులను అడిగారు.

వెలిగొండ ప్రాజెక్ట్ పునరావాస ప్యాకేజి జాబితాలో 320 మంది పేర్లు లేవని, పరిశీలించి వాటిని చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని ఆయన చెప్పారు. పలువురు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు మాట్లాడుతూ స్కూల్స్‌లో విద్యా హక్కు చట్టం పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని కోరారు. చీమకుర్తి బాలికల హాస్టల్ లో భోజనం నాణ్యత పై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. గ్రామాలలో ఫ్లోరైడ్ తాగు నీటి సమస్యను పరిష్కరించాలని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసిన పెండింగ్ బిల్లులు చెల్లించేలా చూడాలని, రామతీర్థం ప్రాజెక్ట్ కు వెళ్ళే దారిలో వున్న ముళ్ళ చెట్లను తొలగించాలని, స్మశానాల లోనూ ముళ్ళ చెట్లను తొలగించి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మండలాల్లో ఆధార్ కేంద్రాల (తరువాయి 4లో...)




# శుభ ఘడియలో శుభ వేడుక..

## అట్టహాసంగా శిద్దా దంపతుల వివాహ వార్షికోత్సవం

## పలు సేవా కార్యక్రమాల నిర్వహణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మి పద్మావతి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ ఏ గిరి బాబు, కాట్రగడ్డ రమణయ్య ఆధ్వర్యంలో చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత శిద్దా రాఘవ రావు దంపతులను ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శిద్దా రాఘవరావు దంపతులు క్షేత్రంలో కొలువై ఉన్న సర్వదేవతలకు విశేష పూజలు నిర్వహించారు. గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ ఏ గిరిబాబు, కాట్రగడ్డ రమణయ్య ఏర్పాటు చేసిన భారీ కేకును శిద్దా దంపతులు కట్ చేశారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ తామర పూలదండను ధరించారు.

**జ్యోతి గ్రానైట్ ఆధ్వర్యంలో వైభవంగా మాజీ మంత్రి శిద్దా వివాహ వార్షికోత్సవం**

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు జ్యోతి గ్రానైట్ సిబ్బంది ఆధ్వర్యంలో చీమకుర్తి హరిహర క్షేత్రంలో వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా జ్యోతి గ్రానైట్ సిబ్బంది ఏర్పాటు చేసిన భారీ కేకును శిద్దా దంపతులు, శిద్దా సుధీర్ కట్ చేశారు. అనంతరం జ్యోతి గ్రానైట్ సిబ్బంది ఏర్పాటు చేసిన భారీ గజమాల శిద్దా దంపతులకు అందించారు. సేవా కార్యక్రమాలతో స్ఫూర్తిని చాటుకున్న మాజీ మంత్రి వివాహ వార్షికోత్సవ వేడుకలు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మి పద్మావతి దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా చీమకుర్తి హరిహర క్షేత్రంలో ఎ గిరిబాబు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలకి శ్రీకారం చుట్టారు. చీమకుర్తి మండలంలోని పాటిమీదపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధ మహిళలకు మందులు కొనుగోలు నిమిత్తం నగదు సాయాన్ని అందజేశారు. నిరుపేద మహిళలకు గృహ నిర్మాణ కోసం సిమెంట్ బస్తాలు అందజేశారు. అనంతరం వృద్ధ బ్రాహ్మణ దంపతులను గౌరవిస్తూ వారికి (తరువాయి 4లో...)

# ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది

## రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి



(షణ్ముఖ వెలుగు, మద్దిపూడి, మే 31)

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను తమ కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. పేదల సేవలో ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చిలంకూరు గ్రామంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి లబ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ, తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్ధంగా అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రానికి ఆర్దికంగా సంక్షోభంలోనికి నెట్టినా సమర్ధవంతమైన నాయకత్వంతో ముందుకు వెళుతున్నామన్నారు. ఎన్డిఏ కూటమి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు మంత్రి అన్నారు. హామీల్లో భాగంగా పించన్ ను పెంచి ప్రతి నెలా ఒకటవ తేదీనే అందచేయడం జరుగుచున్నదన్నారు. ఒకటవ తేదీ ప్రభుత్వ సెలవు వస్తే ముందు రోజే పించన్ అందచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీపం పథకం కింద ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. అలాగే త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ క్రింద కేంద్ర ప్రభుత్వ ఇచ్చే మొత్తంతో కలిపి 20 వేల రూపాయలు, కుటుంబంలో ఎంతమంది పిల్లలు వుంటే అంతమంది పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయబోతున్నట్లు మంత్రి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేయబోతున్నట్లు మంత్రి తెలిపారు. ఎస్సి, బిసి లబ్దిదారులకు మూడు లక్షల రూపాయలు, ఎస్‌టి లబ్దిదారులకు మూడు లక్షల 25 వేలు, ఓసిలకు రెండు లక్షల 50 వేలు ఇంటి నిర్మాణానికి ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ నెలకు 4 వేలు ఇవ్వడం జరుగుచున్నదన్నారు. దివ్యాంగులకు 6 వేల నుండి (తరువాయి 4లో...)

# విపత్తు నిర్వహణ పై అధికారులు ప్రణాళికలు రూపొందించాలి

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మే 31)

తుపాను హెచ్చరికల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ శనివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ నుంచి సమాచారం అందిందన్నారు. పంట కాల్వలు, (తరువాయి 4లో...)

# శుభ ఘడియలో శుభ వేడుక..















నూతన వస్త్రాలు అందజేసి సత్కార్యం నిర్వహించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు వివాహ వార్షికోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారిలో శిద్దా పాండురంగరావు, శిద్దా హనుమంతరావు, సూర్యప్రకాష్‌రావు, ఒంగోలు, చీమకుర్తి, దర్శి, పొదిలి, మార్కాపురానికి చెందిన పలువురు పారిశ్రామిత్తులు వ్యాపార వాణిజ్య వేత్తలు జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు, గ్రానైట్ వ్యాపారాలకు చెందిన పెద్దలు, ఒంగోలుకు చెందిన కన్స్ట్రక్షన్ బిజినెస్‌కి చెందిన గుప్తాస్ వీరబాబు, సివిల్ ఇంజనీర్ సత్యనారాయణ, గోల్డ్ మర్చంట్ వర్తకులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు శిద్దా రాఘవరావు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు, అభిమానులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలి

సంఖ్యను పెంచాలని కోరారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను, సూచనలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యా హక్కు చట్టం అమలు, అర్హతల పై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ పునరావాస ప్యాకేజి జాబితాలో పేర్లు లేని వారి అర్హతను పరిశీలించేందుకు గ్రామసభలు పెట్టామన్నారు. అర్హులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రస్తుతం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కూడా పాల్గొని యోగా సాధన చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కరోనా కేసులు పెరుగుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వారికి సూచించారు. జెడ్పీ సీఈవో మాట్లాడుతూ సవరించిన మార్గదర్శకాల మేరకు స్టాండింగ్ కమిటీ, మండల పరిషత్ ఆమోదించే పనుల అంచనాల విలువను రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు, జిల్లా పరిషత్ ఆమోదించే పనుల అంచనాల విలువను రూ.10 లక్షల నుంచి 25 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. కొత్త జెడ్పీ సమావేశ మందిరం నిర్మాణానికి గతంలో రూపొందించిన రూ.20 కోట్ల అంచనాలను సవరించేందుకు, గత రెండు స్టాండింగ్ కమిటీలలో ఆమోదించిన 350 ప్రతిపాదనలకు కూడా ఈ సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. ముందుగా పహల్గాం ఉగ్ర దాడిలో అమరులైన వారికి నివాళిగా రెండు నిమిషాల పాటు ఈ సమావేశంలో మౌనం పాటించారు.










# విపత్తు నిర్వహణ పై అధికారులు ప్రణాళికలు రూపొందించాలి

చప్టాలు, చెక్ డ్యాములు ఎలా ఉన్నాయో పరిశీలించాలన్నారు. కాల్వలు, చెరువు కట్టలు బలహీనంగా ఉన్న వాటిని గుర్తించి బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. అధికంగా వర్షాలు కురిస్తే పట్టణ ప్రాంతాలలోని మురికి కాల్వలోని మురుగు రహదారులపై పొర్లిపారే అవకాశం ఉన్నందున ముందస్తుగా పూడికతీత పనులు చేపట్టాలన్నారు. మలేరియా, డయేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకకుండా ముందుగానే నివారణకు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం ఆర్డీవోలు, సంబంధిత అధికారులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. తుపాను హెచ్చరిక నేపథ్యంలో గ్రామ స్థాయిలో విపత్తు నిర్వహణ కమిటీలను అధికారులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకట మురళి ఆదేశించారు. బాపట్ల జిల్లాలో ఆరు మండలాలలో 31 గ్రామాలు తీర ప్రాంతంలో ఉన్నాయన్నారు. 83 ఆవాస ప్రాంతాలలో ప్రజలు నివాసం ఉంటున్నారని చెప్పారు. ఆకస్మికంగా 20 ఎంఎం వర్షం కురిస్తే దిగువ ప్రాంతాలలో తీసుకోవాల్సిన సహాయక చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారిని గుర్తించాలన్నారు. మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను ముందస్తుగానే నిల్వ చేసుకోవాలని ఆదేశించారు. విపత్తు నిర్వహణపై అధికారుల ప్రణాళికలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో బాపట్ల, చీరాల ఆర్డీవోలు పి గ్లోరియా, చంద్రశేఖర్, ఉప కలెక్టర్ లవన్న, పర్యవేక్షకులు షేక్ షఫీ, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది

15 వేలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు 10 వేలు ఇవ్వడం జరుగుచున్నదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,718 కోట్ల రూపాయలు పెన్షన్లకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదని మంత్రి తెలిపారు. ప్రకాశం జిల్లాలో 124 కోట్ల రూపాయలు, కొండపి నియోజక వర్గంలో



18 కోట్ల 19 లక్షల 88 వేల రూపాయలు, మర్రిపూడి మండలంలో 2 కోట్ల 38 లక్షల 71 వేలు, చిలంకూరు గ్రామంలో 10 లక్షల 6 వేల 500 రూపాయలు పెన్షన్ రూపంలో ఇస్తున్నట్లు మంత్రి వివరించారు. నియోజక వర్గంలో రోడ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యతఇస్తూ రోడ్డు మరమ్మతులు పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. పొగాకు రైతులకు ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధికి ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఎంపీడీవో జగదీశ్వర రావు, తహసిల్దార్ జ్వాలా నరసింహారావు , ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సహ ఉద్యోగికి సమాచారశాఖ ఘన వీడ్కోలు

ఒంగోలులోని జిల్లా కార్యాలయంలో ఆమె విధులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఒంగోలులోని జిల్లా కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించి ఆమెతో కలిసి పనిచేసిన అనుభవాలను ఉద్యోగులు, సిబ్బంది గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డి.ఐ.పి.ఆర్.ఓ వేణుగోపాల్, డి.పి.ఆర్.ఓ. రమేష్, డివిజనల్ పిఆర్ఓ దుర్గాప్రసాద్, రిటైర్డ్ డి.ఈ.ఐ.ఈ. రమణమూర్తి, రిటైర్డ్ డిపిఆర్ఓ నారాయణ, కార్యాలయ సబ్బంది పాల్గొన్నారు.



# యోగా సాధనతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు

## పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మే 31)

యోగ సాధన వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, అందరూ యోగ సాధన చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. శనివారం,యోగాంధ్ర క్యాంపెయిన్లో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాచీన భారతదేశం గర్వించదగినటువంటి ప్రక్రియ యోగా ప్రక్రియ అని ఆయన అన్నారు. మన పూర్వీకులు, మహర్షులు వేల సంవత్సరాల క్రితం యోగాను అభివృద్ధి చేసి ఒక పాఠ్యాంశంగా ఒక పరంపర కొనసాగే విధంగా ప్రపంచానికి అందించారని ఆయన అన్నారు. యోగ అనే ప్రక్రియను సంకల్పించుకొని తమ జీవితంలో దైనందిన భాగంగా చేసుకోవాలని ఆయన అన్నారు. జీవితకాలం అంతా ఈ యోగాను అనుసరిస్తూ, చేస్తూ వారి జీవితాన్ని ఆరోగ్య పరంగా తీర్చిదిద్దుకోవడానికి పనికివచ్చే సాధన అని అన్నారు. సైన్సు,సాంకేతికత లేని రోజులలో మన పూర్వీకులు వేల సంవత్సరాల క్రితం దీనిని ఎలా అభివృద్ధి చేశారు అనేది మనందరిని ఆశ్చర్యానికి గురి చేస్తుందని ఆయన అన్నారు. వారు ఆ రోజుల్లో ఏ విధమైన ఆచార వ్యవహారాలలో ఉన్నారో, ఏ విధమైనటువంటి పరిస్థితులు ఇటువంటి గొప్ప ప్రక్రియను కనిపెట్టడానికి దోహదం చేశాయో ఈ ప్రక్రియ ఒక పరంపరగా మన దేశంలో పౌరులందరికీ సంక్రమించిందని ఆయన అన్నారు. మంచి ఆరోగ్యాన్ని,మంచి జీవన సరళిని మెరుగుపరుచుకోవడానికి యోగాను అలవర్చుకోవాలని ఆయన అన్నారు. యోగా సాధన వలన చాలా ప్రయోజనాలు ఉన్నాయని ఆయన అన్నారు. యోగ సాధన వల్ల ఇమ్యూనిటీ శక్తి పెరుగుతుందని ఆయన అన్నారు. జీవనశైలిలో వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్, ప్రోటోజువా మొదలగు వాటి వలన సంక్రమించే వ్యాధులను ఈ యోగా సాధన వలన కొంతవరకు ఎదుర్కోవచ్చని ఆయన అన్నారు. సూక్ష్మ క్రిముల దారణకు కారణం కానీ క్యాన్సర్, బిపి, షుగర్, గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు, వెన్నుపూస సంబంధిత వ్యాధులను యోగా ద్వారా తగ్గించుకోవచ్చని ఆయన తెలిపారు. జిమ్ ల కంటే యోగా వలన మనిషిలో జీవకల, ధైర్యం, మనసుకు ప్రశాంతత లభిస్తుందని ఆయన అన్నారు. పిల్లలు, పెద్దలు అందరూ యోగ పట్ల ఆకర్షితులను చేయుటకు మనం ఈ కార్యక్రమాన్ని బహిరంగంగా నిర్వహించుకుంటున్నామని ఆయన అన్నారు. రాబోవు రోజుల్లో ఈ కార్యక్రమాన్ని మరిన్ని చోట్ల నిర్వహించుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బహిరంగంగా నిర్వహించుకోవడంలో ప్రజల దృష్టిని యోగా వైపు మరల్చి వారి ఆరోగ్యాన్ని కాపాడే సదుద్దేశంతో నిర్వహిస్తున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. భారతదేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్ గా తీర్చిదిద్దాలని భారత ప్రభుత్వం ఆశయం అని ఆయన తెలిపారు. దీనికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ను స్వర్ణాంధ్రప్రదేశ్ గా చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యం అని ఆయన తెలిపారు. స్వర్ణాంధ్రతో పాటు యోగాంధ్ర ను అనుసంధానించి అభివృద్ధితో పాటు ఆరోగ్యపరంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశం అని ఆయన అన్నారు. రోజు యోగా చేసుకొనుటకు ఆసక్తి ఉన్న ఎడల కలెక్టర్ కార్యాలయము ఎదురుగల ఈటిసి హాలులో ప్రతిరోజు ఉదయం యోగా గురువు చేత శిక్షణకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. రోజు ఒక క్రమ పద్ధతిలో యోగా చేసుకోవడం వల్ల మంచి ఆరోగ్యాన్ని తద్వారా ఆయుష్షను పెంచుకోవచ్చని ఆయన తెలిపారు. మే 31వ తేదీ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వలన ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వస్తాయన్నారు. ఆస్తమా, క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధులు వస్తాయని, అందుకు పొగాకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా ధూమపానం సేవించినా, ఆ వాసనను పీల్చినా ప్రోగ తాగే వారి లెక్కలోకి వస్తారని ఆయన అన్నారు. పాన్, గుట్కా మొదలగు వాటిని సేవించిన కూడా క్యాన్సర్ కు గురవుతారని వారు అన్నారు. పొగాకు ఉత్పత్తులను వాడకుండా వాటికి దూరంగా ఉండాలని, ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలతో జీవితాన్ని ఎంచుకో పొగాకును కాదు అనే అంశం పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, పిడి డిఆర్డిఏ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి, బాపట్ల రెవెన్యూ డివిల్ అధికారి పి గ్లోరియా, ఇతర అధికారులు, యోగా గురువులు , విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.







## సమతా వేదిక వృద్ధాశ్రమంలో అహల్య భాయ్ జన్మదిన వేడుకలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

భారత దేశంలో వినతి కెక్కిన రాజులతో పాటు ఎందరో మహారాణులు సైతం దేశాన్ని సస్యశ్యామలంగా, శత్రు దుర్భేద్యంగా ప్రజాహితంగా ఏలిన వారు ఎందరో ఉన్నారు. వారిలో అగ్రగణ్యులు సాధ్వి అహల్య భాయి ఒకరిని, 300 ఏళ్ల క్రితం ఇండోర్ రాజధానిగా 30 ఏళ్ల పాటు ఏకచక్రాధిపత్యంగా రాజ్యపాలన చేసిన రాజమాత సాధ్వి అహల్య భాయి అని శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు రాధా రమణ గుప్తా జంధ్యం తెలిపారు. శనివారం సాయంత్రం అహల్య భాయి త్రిశత జయంతి బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బి.విజయరావు అధ్యక్షతన ఒంగోలు నగరంలోని స్థానిక సీతరామపురం లోని సమంతా వేదిక వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన అహల్య భాయి జయంతి పక్షోత్సవాల ముగింపు, అహల్య భాయి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన రాధా రమణ గుప్తా మాట్లాడుతూ... దైవ భక్తి కలిగి, సాటి ప్రజలు సుఖ,శాంతులతో జీవించాలని అహల్య భావించేవారని, వారి భక్తి, మంచి నడవడికను గమనించిన మల్హార్ రావు తమ కుమారునకు భార్యగా తగినదని భావించి 7 ఏళ్ల వయసు గల అహల్యను 10 సంవత్సరాల తమ కుమారుడు ఖండేల్వార్ కు ఇచ్చి వివాహం చేశారని తెలిపారు. కాలక్రమంలో భర్త మరణించగా అప్పటి సామాజిక పరిస్థితులను సతీసహగమనం

చేయాలని అహల్య భావించగా మామ, దేశ ప్రజలు వద్దని వారించారు. వారి సూచనలతో సహగమనం విరమించారు. అహల్య భాయ్‌కి వారి మామగారు యుద్ధ విద్యలు నేర్పించారు. మామ మరణించిన తర్వాత, బిడ్డ చిన్నవాడు అయినందున దేశ రక్షణ బాధ్యతలను స్వీకరించి. అప్రతిహసంగా 30 సంవత్సరాలు ఇండోర్ రాజధానిగా రాజ్యపాలన చేశారు. వారి పాలనలో ప్రజల సంక్షేమం. ప్రజల రక్షణ, దోపిడి దొంగలు థగ్గుల నుండి రక్షణ, నేత కార్మికులకు బాసటగా మల్లేశ్వరం చీరలను అభివృద్ధి చేసినారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఆలయాల అభివృద్ధి, భక్తులకు వసతి గృహాలు, కోనేరు వంటి సదుపాయాలు కల్పించినారు. అంతటి మహాసాధ్వి అహల్య బాయ్ మహిళామూర్తులకు స్ఫూర్తివంతమైన నాయకురాలుగా కీర్తించబడ్డారని వివరించారు. భారత దేశ ప్రధాని నరేంద్ర దామోదర్ దాస్ మోదీ హిందూదేశంలోని స్ఫూర్తివంతమైన మహిళలను ప్రపంచానికి తెలియ చెప్పడానికి అహల్య భాయ్ త్రిశత జయంతి పక్షోత్సవాలను నిర్వహించలని పిలుపునిచ్చారని తెలిపారు. ఆ కార్యక్రమంలో భాగంగా ఈ రోజున మీ అందరికీ అహల్య బాయ్ గురించి తెలుపుటకు చాలా సంతోషంగా ఉన్నదని, వారి విగ్రహాన్ని ప్రభుత్వ అనుమతితో అమ్ము ఫౌండేషన్ ద్వారా ఒంగోలు నగరంలో నెలకొల్పటానికి ప్రభుత్వ అధికారులకు వినతి పత్రం అర్పించడం జరిగినదని అమ్ము ఫౌండేషన్ వ్యవస్థాపకులు, భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బి.విజయరావు తెలిపారు. ఈ సమావేశంలో భారతీయ జనతా పార్టీ ప్రకాశం జిల్లా మీడియా కన్వీనర్ ధనిశెట్టి రాము, జిల్లా కార్యదర్శి తీగల సత్యవతి, మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యురాలు ధనిశెట్టి పావని మండల అధ్యక్షురాలు దేవరపల్లి శ్రీలక్ష్మి, రాజు , రేవతి ఆశ్రమం నిర్వాహకులు అంకబాబు, సిబ్బంది పాల్గొన్నారు.






## డైస్ ప్రాంగణంలో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

డైస్ (రిమ్స్) ప్రాంగణంలో శనివారం ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం-2025ను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థులచే నిర్వహించారు. ఈ సంవత్సరం థీమ్ ఏమి అనగా "అప్పీల్‌ను విప్పడం, పొగాకు, నికోటిన్ ఉత్పత్తుల పై పరిశ్రమ వ్యూహాలను బహిర్గతం చేయడం" అనే థీమ్‌తో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యన్‌సిడి నోడల్ అధికారో డాక్టర్ భగీరథి మాట్లాడుతూ ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం -2025 ను. 15 రోజులపాటు ప్రచారాన్ని నిర్వహించవలసినదిగా కమీషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మంగళగిరి గుంటూరు జిల్లా వారు తెలిపియున్నారు. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం-2025 ను పాటించడానికి సూచించబడిన కార్యకలాపాల జాబితా పొగాకు వినియోగదారులకు ప్రోత్సాహక, నివారణ మరియు స్క్రీనింగ్ కార్యకలాపాలు, ముఖ్యంగా కౌమారదశలో ఉన్నవారు, ఫ్యాక్టరీ కార్మికులు వలస జనాభా పొగాకు రైతులు గ్రామీణ ప్రాంతాలు పట్టణ ప్రాంతాలు గర్భిణీ స్త్రీలు, పాఠశాల పిల్లలు వంటి దుర్బల జనాభాలో, సమాచార విద్య కార్యకలాపాలు, ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యకలాపాలు. దంతవైద్యులు, నర్సులు, పారా డెంటల్, వైద్య నిపుణులు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు ఆరోగ్య కార్యకర్తల శిక్షణ మరియు సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు. పాఠశాల ఆధారిత పొగాకు నియంత్రణ మరియు విరమణ చొరవలు, పొగాకు వ్యతిరేక సంతకం ప్రచారం. వాకథాన్ మారథాన్ రహగిరి సైకిల్ ర్యాలీ పబ్లిక్ లెక్చర్స్ వంటి పబ్లిక్ ఈవెంట్‌లు. "పొగాకు రహిత తరం" కోసం ప్రజలకు, రోగులకు ప్రతిజ్ఞ కార్యక్రమం. పొగాకు భారం గురించి అవగాహన కల్పించడం, రోగులకు విరమణ సేవలను అందించడం కోసం ఆరోగ్య సంరక్షణ నిపుణుల ప్రతిజ్ఞ కార్యక్రమం. సోషల్ మీడియా. రేడియో టీవీ ప్రచారం వార్తాపత్రిక వ్యాసం టాక్ షోలు వీధి నాటకాలు ఫ్లాష్ మాబ్. ఆయుష్, వైద్య, నర్సింగ్ కళాశాలలు, రాష్ట్ర పొగాకు సెల్ తో సహకారం, సెమినార్ వర్క్‌షాప్, పరిశోధన, వాటాదారుల సహకారం, దంత కళాశాల వంటి పొగాకు పరిశ్రమ జోక్యాన్ని అంతం చేసే దిశగా చర్యలు వంటి పై కార్యక్రమాలు అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో నిర్వహించవలసినదిగా తెలిపారు. ఈ కార్యక్రంలో డాక్టర్ సుధాకర్ ప్రభుత్వ వైద్య కళాశాల వైఎస్. ప్రిన్సుపాల్ , డాక్టర్ అనిల్ ఫ్లోరోసిస్ వైద్య అధికారి, జిల్లా మాస్ మీడియా అధికారి డి శ్రీనివాసులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల సిబ్బంది, యన్‌సిడి, ఆర్‌బిఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ జయంతి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

పద్మభూషణ్, నటశేఖర సూపర్ స్టార్ కృష్ణ 83వ జయంతి కార్యక్రమం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం ఉదయం సూపర్ స్టార్ కృష్ణ కళా పరిషత్ అధ్యక్షులు జాలాది మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. తొలుత కృష్ణ చిత్రపటానికి పలువురు పుష్ప మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవ సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు మాట్లాడుతూ సంచలనాలకు, సాహసానికి మారుపేరు సూపర్ సార్ కృష్ణ అని చిత్ర రంగంలో సాంకేతిక విప్లవానికి ఆయన నాంది పలికారని, సినీ రంగంలో కొత్తవారిని ప్రోత్సహిస్తూ, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నవారికి చేయూతనిస్తూ తను ఉన్నంతకాలం తెలుగు చలనచిత్ర రంగానికి కొండంత అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి సూపర్ స్టార్ కృష్ణ ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి సంస్థ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు, కార్యదర్శి షేక్ మహబూబ్ బాషా, జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, ప్రముఖ చిత్రకారుడు తిమ్మిరి రవీంద్ర, తిమ్మిరి శిరీష, పెరిక ఇమ్మానియేలు, కత్తుల వెంకట ఆనందబాబు, డివి సుబ్బారావు, మెత్తాల్ల అభిషేక్, కె సంపూర్ణ, డి సందీప్, పి పేరయ్య, పి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ అమ్మవారి హుండీ ఆదాయం రూ.22,17,367







(షణ్ముఖ వెలుగు, జరుగుమల్లి, మే 31)

జరుగుమల్లి మండలం పోలేరమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు సందర్భంగా 18 -11- 2024 నుండి 30 -5- 2025వ తేదీ వరకు ఆరు నెలల 12 రోజులకు గాను 22 లక్షల 17, వేల 367 రూపాయలు యూఎస్ డాలర్లు రెండు వచ్చినట్లు ఆలయ ఈవో బైరాగి చౌదరి తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ అధికారులు, అమ్మవారి గ్రామ సేవకులు పాల్గొన్నారు.

## చలగల్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో మంత్రి డోలా, ఎపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 31)

కొండపి గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు చలగల్ల మల్లికార్జున్ వెంకట సుధాకర్ అన్నదమ్ముల నూతన గృహప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొని చలగల్ల మల్లికార్జున రావు వెంకట సుధాకర్రావు అన్నదమ్ముల్ని ఆశీర్వదించారు. ఈ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో జిల్లా మండల జనసేన నాయకులు పాల్గొన్నారు.

## స్టేట్ యూత్ వింగ్ సెక్రెటరీగా నియమితులైన నెమలిదిన్నే చెన్నారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీటీసీ



(షణ్ముఖ వెలుగు, కంభం, మే 31)

కంభం మండలం జంగంగుంట్ల గ్రామానికి చెందిన నెమలిదిన్నే చెన్నారెడ్డి 2024 సార్వత్రిక ఎన్నికల్లో విశేష కృషి చేశాడు. అది గుర్తించిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నెమలిదిన్నే చెన్నారెడ్డి కి స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీగా బాధ్యతలు ఇవ్వడం జరిగింది. దీంతో కంభం ఎంపీటీసీ షేక్ మహమ్మద్ రఫీ (ఎంపిటీసి) తో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

## పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న దాదా

## ఒకరోజు ముందుగానే పింఛన్ పంపిణీ





(షణ్ముఖ వెలుగు, కంభం, మే 31)

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశానుసారం కంభం మండలం కంభం గ్రామపంచాయతీ పరిధిలోని జుమ్మా మసీద్ సెంటర్ చిన్న మసీద్ వీధులలో ఇంటింటికి తిరిగి పింఛన్ పంపిణీ చేసిన ఒంగోలు పార్లమెంట్ ముస్లిం మైనార్టీ సెల్ కార్యనిర్వాక కార్యదర్శి అత్తర్ షేక్ హుస్సేన్ (దాదా) పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సెలవు రోజులొస్తే ఒకరోజు ముందు పింఛన్ ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు పటాన్ నాగురులీ ఖాన్, నాయబ్ సుభాని, తదితరులు పాల్గొన్నారు.

సీతారామస్వామి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి

## ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు

## ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ఇంటూరి







(షణ్ముఖ వెలుగు, వలేటివారిపాలెం, మే 31)

మండలంలోని చుండి పంచాయతీలోని కాకర్లపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ స్వామి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా వేద పండితులు ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు.. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు వేద ఆశీర్వాదం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఇంటూరి నాగేశ్వరరావుకి గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై డప్పు వాయిద్యాలతో, బాణాసంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహాం, నల్లబోతుల కొండలరావు, హరికృష్ణ, లక్ష్మీ, బ్రహ్మయ్య, రమణయ్య, ఇతర నాయకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన వారికి ఆత్మీయ వీడ్కోలు

**విధులపై ఉన్న నిబద్ధత, అంకితభావంతో జిల్లా పోలీస్ శాఖకు అందించిన సేవలు మరువలేనిది**

**పోలీసు శాఖ సేవలు వెలకట్టలేం- జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్**

**కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా సాగిన ఆత్మీయ వీడ్కోలు**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

పోలీస్ శాఖలో సుధీర్ఘకాలం పాటు విశిష్ట సేవలందించి శనివారం ఉద్యోగ విరమణ పొందిన స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ యన్.సురేష్ బాబు,ఆర్మడ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఏ వెంకటేశ్వరరావు, వివి భాస్కర్‌రెడ్డి, కె వెంకట రంగారావు, కె వి రంగారెడ్డిలను జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్, పోలీస్ అధికారులు శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించి, జ్ఞాపికలు అందచేసి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ మాట్లాడుతూ పోలీస్ శాఖకు సుధీర్ఘకాలం పాటు నిబద్ధత, అంకితభావంతో అందించిన సేవలను ఎప్పటికీ మరువలేమని, విధి నిర్వహణలో కేటాయించిన అన్ని విధులు సమర్థవంతంగా పనిచేసి మంచి అధికారులుగా పేరు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో చూపిన నైపుణ్యం, పట్టుదల పోలీస్ శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా నిలుస్తుందన్నారు. ఆయన సర్వీసులో అనేక క్లిష్టమైన కేసులు ఎదురైనప్పటికీ, మనోధైర్యంతో, నాయకత్వ నైపుణ్యంతో వాటిని విజయవంతంగా పరిష్కరించారని తెలిపారు. రిటైర్మెంట్ అనేది సేవకు ముగింపు కాదన్నారు. సాధారణ బందోబస్తు నుంచి శాంతిభద్రతల పరిరక్షణ విధుల్లో ఏ. ఆర్ సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ఎటువంటి రిమార్కులు లేకుండా 35-43 సం.లు పోలీసుశాఖకు సేవలందించడం అభినందనీయమన్నారు. వారి యొక్క సర్వీస్ లో రివార్డ్స్, సేవాపతకం, ఉత్తమ సేవాపతకం, గుడ్ సర్వీస్ పొందియున్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు, కుటుంబ బాధ్యతలను కూడా చక్కగా నిర్వర్తించి, వారి పిల్లలను మంచి విద్యావంతులుగా తీర్చిదిద్ది, వారు ఉన్నత స్థానంలో నిలిచేలా చేసారన్నారు. రిటైర్మెంట్ అనంతరం ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, జీవితాన్ని ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. సకాలంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందేటట్లు అన్ని చర్యలు తీసుకుంటామని, వచ్చిన డబ్బులను జాగ్రత్తగా ప్రణాళిక ప్రకారం ఉపయోగించుకోవాలన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా మీరు పోలీసు కుటుంబంలో సభ్యులేనని భవిష్యత్తులో ఎటువంటి సహకారం అవసరమైనా పోలీసుశాఖ తప్పకుండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, వై.పాలెం సీఐ ప్రభాకర్, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఏఆర్ఎస్ఐ తిరుపతి స్వామి, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.







# నైపుణ్యాభివృద్ధికి లెక్కలు, ఇంగ్లీషులో విజ్ఞానం పెంపొందించుకోవాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

శాస్త్ర సాంకేతిక రంగాల్లో నైపుణ్యాభివృద్ధిని సాధించాలంటే లెక్కలు ఇంగ్లీషులో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పీపుల్స్ ఎన్విరాన్మెంట్ మా మాసపత్రిక సంపాదకుడు పుత్తూరు నారాయణరావు, ఒంగోలులోని ప్రగతి మెడికల్స్ అధినేత ఎల్లమూరి రామయ్య స్పష్టం చేశారు. శనివారం ఆసరా ఆధ్వర్యంలో జరిగిన తొమ్మిది పది తరగతుల వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా మారెళ్ళ గుంట పాలెం ఆసరా కేంద్రంలో సభ జరిగింది. ఈ సభకు ఆసరా అధ్యక్షుడు చెడిపోతు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు కొత్తూరు నారాయణ మాట్లాడుతూ నేడు శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రపంచం వేగంగా ముందుకు పోతుందని భారతదేశం పోటీలో నిలవాలంటే చదువులో ప్రత్యేకించి ఇంగ్లీషు లెక్కలలో ప్రావీణ్యం సంపాదించాలని కోరారు.రామయ్య మాట్లాడుతూ విద్యలో నైపుణ్యం సంపాదించాలని అబ్దుల్ కలాం, బాబాసాహెబ్ అంబేద్కర్ లను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు.కామరాజు నాడార్ చదువు లేకపోయినా విద్యను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసి విద్యార్థులకు చదువు నేర్పించుటకు కృషి చేశాడని గుర్తు చేశారు అందువల్ల చదువు లేని వారిని కించపరచరాదని వారు చదువుకునేట్లు ప్రోత్సహించాలని కోరారు. సభలో రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కె వి వి ప్రసాద్ ,జిల్లా సిపిఐ సీనియర్ నాయకులు యు ప్రకాష్ రావు ,పెద్దకొత్తపల్లి హెడ్మాస్టర్ ,ముప్పరాజు అన్నపూర్ణ ,చంద్రమౌళి ,ఎం కృష్ణయ్య ,తదితరులు ప్రసంగించారు.పెద్దకొత్తపల్లి మాజీ సర్పంచ్ పోతినేని బుచ్చయ్యను.ఆసరా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు సిపిఐ నాయకులు యు ప్రకాష్ రావు సత్కరించారు.వారితో పాటు జడ్పీహెచ్ఎస్ స్కూల్ హెడ్మాస్టర్ సమ్మర్ కోచింగ్ కు శిక్షణ నిచ్చిన లెక్కలు మాస్టర్ చంద్రమౌళి గార్లను ఘనంగా సత్కరించారు . ఈ సందర్భంగా పదో తరగతి చదువుతున్న బి ప్రణీత్ బాలికల విభాగంలో నేహా చౌదరి లకు నలదల వెంకటకృష్ణారావు, సిహెచ్ వెంకటేశ్వర్లు ప్రథమ బహుమతులను అందజేశారు. 9వ తరగతిలో శిక్షణ పొందిన లోకేష్ ,బాలికల విభాగంలో నిహారిక కు నా తాని రఘురామయ్య, పుత్తూరు నారాయణరావు గారు ప్రథమ బహుమతిని అందించారు.పదవ తరగతి 9వ తరగతి లో శిక్షణ పొందిన మస్తానమ్మకు, వి సింగయ్య గాయత్రీ కిరణ్‌కు శివ నాగేశ్వరరావు ద్వితీయ బహుమతులను అందజేశారు.అరుణ్ నందిత లకు కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు. చివరగా శిక్షణ శిబిరానికి ఆర్థిక సహాయం చేసిన దాతలు అందరకు, అదేవిధంగా నెలరోజుల పాటు విద్యార్థిని, విద్యార్థులకు ఆహార సదుపాయాలు కల్పించిన ఆసరా కేంద్రం సిబ్బందికి, ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులకు ఆర్థిక సాయం చేసిన నలదల వెంకటకృష్ణారావు, వారి సోదరులకు ఆసరా తరఫున ఎంసీ వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు.



# ఇచ్చిన హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఒక రోజు ముందుగానే పింఛన్ పంపిణీ

(షణ్ముఖ వెలుగు, కంభం, మే 31)

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రేపు సెలవుదినం కావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్ కార్యక్రమం నిర్వహించిన ప్రభుత్వం.



ఇందులో భాగంగా ఫిబ్రవరి 12వ తేదీన జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో రాచపూటి క్రిష్ణ ( చిలక క్రిష్ణ ) అనే వ్యక్తి తనకు ఎటువంటి ఆధారం లేదని, దయచేసి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయవలసిందిగా ఎమ్మెల్యేని కోరగా, తన పరిస్థితి అర్థం చేసుకున్న ఎమ్మెల్యే ప్రభుత్వం నుంచి పింఛన్ వచ్చే వరకు, తానే పింఛన్ నగదు 4000 అందజేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు కంభం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తోట వెంకట శ్రీనివాసరావు ,కంభం కాలనీ నాయకులు ఈ రోజు పింఛన్‌దారుడు ఇంటి వద్దకు వెళ్లి నాలుగో నెల పింఛన్ 4000 రూపాయలు అందజేసారు. అనంతరం చిలక క్రిష్ణ నెల నెల తనకు ఎమ్మెల్యే చేస్తున్న సహాయానికి చాలా సంతోషంగా ఉందని , ఇచ్చిన మాట ప్రకారం మరచిపోకుండా ప్రతినెల ఇంటివద్దకు పింఛన్ పంపిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# నాడు మామ ఎన్టీఆర్‌కు.. నేడు రాష్ట్రంలోని మహిళలకు చంద్రబాబు వెన్నుపోటు

**పాలన చేతకాక మా మీద పడతారే**

**రెడ్ బుక్‌కు భయపడే వారే లేరు**

**వైసీపీ అప్పుల కన్నా కూటమి అప్పులే ఎక్కువ**

**వెన్నుపోటు దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించిన వైసీపీ నేతలు**

**మీడియా సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

చంద్రబాబు నాయుడు వెన్నుపోటు రాజకీయాలతో నిరసనగా ఈ నెల 4వ తేదీన జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించే వెన్నుపోటు నిరసన ర్యాలీలను జయప్రదం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను వైసీపీ నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాడు మామ ఎన్టీఆర్ ను, నేడు రాష్ట్రంలోని మహిళలను వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు కావటం లేదని ధ్వజమెత్తారు. దీపం పథకం కింద మహిళలకు ఉచిత గ్యాస్ లేదని, రైతాంగానికి గిట్టుబాటు ధరలు లేవని, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని, సంపద సృష్టి ఎక్కడ అని ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించలేని కూటమి ప్రభుత్వం ప్రతిదానికి వైసీపీ పై పడటం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ హయాంలో చేసిన అప్పుల కన్నా, కూటమి ప్రభుత్వం ఏడాది కాలం పాలనలో చేసిన అప్పులే ఎక్కువ అన్నారు. తెచ్చిన అప్పులు ఏమయ్యాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది అన్నారు. నాడు జగన్ పాలనలో తెచ్చిన అప్పుల నగదు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజల జేబుల్లోకి వెళ్లాయి అన్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేసిన అప్పులు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అర్థం కావడం లేదన్నారు. రెడ్ బుక్కు ను చూసి భయపడే వారు ఎవరూ లేరన్నారు. తప్పుడు కేసులను పోరాటాల ద్వారా తిప్పి కొడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ చుండూరి రవిబాబు, మార్కాపురం నియోజకవర్గం ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు, కనిగిరి నియోజకవర్గం ఇంచార్జ్ దద్దాల నారాయణ, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ మేరుగ నాగార్జున, కొండపి నియోజకవర్గం ఇంచార్జ్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, గౌతం అశోక్, తదితరులు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా సంక్షేమం

## పింఛన్ల పంపిణీలో పాల్గొన్న చీఫ్ విప్ జీవీ, మక్కెన





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 31)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర్నుంచి సంక్షేమం మూడు పువ్వులు, ఆరు కాయలుగా అమలవుతోందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ప్రతి నెల 1వ తేదీనే 65లక్షలమందికి ఉదయమే తలుపు తట్టి మరీ పింఛన్లు ఇస్తున్నారని, 1వ తేదీ సెలవు అయితే ముందు రోజే లబ్దిదారులకు పింఛన్లు అందిస్తూ ఉండడం ముఖ్యమంత్రి చంద్ర బాబు మంచి మనసుకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్లు ఎప్పుడు వస్తాయో తెలీ ని అయోమయం, అర్హుల పేర్లు కూడా తొలగించిన పరిస్థితుల నుంచి ఎన్డీయే ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు మంచి సంప్రదాయానికి శ్రీకారం చుట్టడం ఎంతో సంతోషం ఇస్తోందన్నారు. వినుకొండ 26వ వార్డు కట్టకింద బజారు ప్రాంతంలో చీఫ్‌విప్ జీవీ పలువురు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇచ్చినమాట నిలబెట్టుకునే ఏకైక నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. లబ్ధిదారుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ఎవరైనా పలు కారణాలతో 3నెలలు పింఛన్ తీసుకోకపోయినా ఒకేసారి



అందజేస్తున్నామన్నారు. వినుకొండ లో ప్రతినెల 5,250 మందికి, రూ. 2కోట్ల 31 లక్షల 50వేలు పింఛన్లుగా అందిస్తున్నామన్నారు. గతంలో రూ. 3వేలు ఉన్న పింఛన్‌ను ఇప్పుడు రూ. 4వేలు చేశారు. విభిన్న ప్రతిభావంతులకు రూ. 3వేల నుంచి రూ.6వేలకు పెంచిన విషయం గుర్తు చేశారు. ఇంట్లో పింఛన్ అందుకుంటూ ఉన్నవారు ఎవరైనా చనిపోతే ఆ ఇంట్లో అర్హత ఉన్నవారికి 15రోజుల్లోనే పింఛన్ ఇస్తున్నామన్నా రు. 2నెలల తర్వాత కొత్త పింఛన్లు ఇవ్వబోతున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు సదరం సర్టిఫికేట్లు తీసుకుని పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల తరఫున రుణాల ద్వారా కూడా పేదల అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. విజన్-2047, అప్పటికి రాష్ట్ర తలసరి ఆదాయం రూ.55లక్షలకు చేర్చాలన్నది సీఎం చంద్ర బాబు లక్ష్యంగా చెప్పారు. ప్రధాని మోదీ కూడా రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు నిధులతో పాటు అనేకాంశాల్లో రాష్ట్రానికి సహాయ, సహకారాలు అందిస్తున్నారని అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేస్తున్నారని, సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నారని తెలిపారు. 20 లక్షల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు . దానిలోభాగంగా వినుకొండలో జాబ్‌మేళా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. స్థానికంగా చదువుకున్న యువతంగా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మంత్రి నారా లోకేష్ ఇదే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున ఉద్యోగాల కల్పనకు శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీబీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, అధికారులు, కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నిబద్ధతతో విధులు నిర్వహిస్తే ప్రతి ఒక్కరి హృదయాల్లో నిలిచిపోతారు

## సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులు - టి మోహన్‌రాజు




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మే 31)

నిబద్ధతతో విధులు నిర్వహించినప్పుడే అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంటారని సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులు టి మోహన్ రాజు అన్నారు. సమాచార శాఖలో 30 సంవత్సరాలు విశిష్ట సేవలందించిన ఏ వి సూపర్ వైజర్ గడ్డం కృష్ణారావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం శనివారం స్థానిక జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో జరిగింది. ఉద్యోగ విరమణ పొందిన కృష్ణారావుతో పాటు ఆయన సతీమణిని అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు




శాలువలు కప్పి పుష్ప మాలలతో ఘనంగా సన్మానించారు. కృష్ణారావును పుష్ప మాలలతో సత్కరించగా, పలువురు నూతన వస్త్రాలు, జ్ఞాపికలను బహుకరించారు. అంకితభావంతో పనిచేసిన కృష్ణారావు అందరిలో మంచి పేరు సంపాదించుకున్నారని సహాయ సంచాలకులు అన్నారు. చిత్తశుద్ధితో పనిచేసిన వారిని తోటి ఉద్యోగులు ఎల్లప్పుడు గుర్తుంచుకుంటారన్నారు. ప్రతి ఉద్యోగి అలాంటి గుర్తింపును తెచ్చుకున్నప్పుడే జీవితానికి సార్ధకత ఉంటుందన్నారు. ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమేనని, కృష్ణారావు తన విధుల పట్ల బాధ్యతతో వ్యవహరించే వారన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకువెళ్లడంలో ప్రధాన భూమిక పోషించే ఈ శాఖలో 30 సంవత్సరాలు విశేష సేవలందించి ఉద్యోగ విరమణ చేస్తున్న కృష్ణారావుకు సహాయ సంచాలకులు శుభాకాంక్షలు తెలిపారు. విశ్రాంత ఉద్యోగిగా ఆయన భావి జీవితం ఆయురారోగ్యంతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాలశాఖ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ ఎస్ కృష్ణమోహన్, ఏపీఆర్‌ఓ ఐ సురేష్, పిఆర్‌ఓ కె కిరణ్ కుమార్, సీనియర్ సహాయకులు పద్మావతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి సమాచార శాఖ అధికారులు, సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, పాత్రికేయులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీరంగం మల్టీ స్పెషాలిటీలో ఆపరేషన్ థియేటర్ ప్రారంభించిన వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, మే 31)

పెద్ద దోర్నాల మండల కేంద్రంలోని కర్నూల్ రోడ్ గల శ్రీరంగ మల్టీ స్పెషల్టి ఆసుపత్రి ఒకటవ భవనంలో అత్యధిక పరికరాలతో దోర్నాల మండలం పరిసర ప్రాంతంలో ఎక్కడ లేని విధంగా లాప్రోస్కోపి ఆపరేషన్ థియేటర్‌ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కాశీరావు ఆసుపత్రి అందించనున్న వైద్య సేవలు గురించి మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు శెగ్గం శ్రీనివాసులు, జిల్లా డియంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సూరిబాబు, కూటమి నాయకులు, రాష్ట్ర టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన బట్టు సుధాకర్‌రెడ్డి, జనసేన కేతి వెంకట మురళి, తెలుగుదేశం సీనియర్ లాయర్ కాశయ్య, ఎస్కే మాబు, దొడ్డ శేషాద్రి, ఈదర మల్లయ్య, అమ్మిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, అమ్మిరెడ్డి మల్లారెడ్డి, ఎస్ కె మంజూరు, పొందుగుల రామిరెడ్డి, తంగిరాల చెన్నారె డ్డి, రావుకింది నరసింహారావు, దేసు నాగేంద్రబాబు, కడిమెట్ల శ్రీనివాస యా దవ్, కటికల దానం, కటికల శ్రీను, కూట మి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.











## మాజీ మంత్రి శిద్దా దంపతుల పెళ్లిరోజు సందర్భంగా అన్నదానం





(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, మే 31)

దర్శి పట్టణంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మి పద్మావతి పెళ్లి రోజు సందర్భంగా గుడిలో పూజలు నిర్వహించారు. శ్రీ షిర్డీ సాయిబాబా వృద్దాశ్రమంలో శిద్దా ప్రతినిధి మండాది సుబ్బారావు, శిద్దా అభిమానులు ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బొగ్గవరపు సుబ్బారావు, అచ్చుత ప్రకాష్, జమిలిమల్లి శ్రీనుబాబు, వీర శివ కొండలు తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు గిట్టుబాటు ధర పెంచాలి కొండేపి ఆర్‌అండ్ బి రోడ్డుపై బైఠాయించి నిరసన









(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 31)

ప్రకాశం జిల్లా కొండపి పొగాకు వేలం కేంద్రంలో కొండపి మండలం గుర్రప్పడియా నెన్ను రుపాడు మూగచింతల జరుగుమల్లి మండలం సతకపాడు గ్రామాల రైతులు పొగాకు గిట్టుబాటు ధర పెంచాలంటూ బయ్యర్లు ప్రమేయం లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటూ టంగుటూరు కొండేపి ఆర్‌అండ్ బి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కిలోమీటర్ పొడవునా రోడ్డుమీద వాహనాలు నిలిచి పోవడంతో ట్రాఫిక్ భారీ అంతరాయం కలిగింది. కొండపి ఎస్‌ఐ ప్రేమ్ కుమార్ చొరవతో రైతులతో మాట్లాడి రోడ్డుపై చేస్తున్న నిరసన విరమింప చేశారు.

## చిన్న కాశి నారాయణరెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కందుల



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మే 31)

మండలంలోని తిప్పాయిపాలెం గ్రామానికి చెందిన కుందూరు చిన్న కాశి నారాయణరెడ్డి ప్రమాదవశాత్తు శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెంటనే మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆయన భౌతిక కాయాన్ని మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో సందర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చిన ధైర్యం చెప్పారు. పార్టీ మీకు అండగా నిలుస్తుందన్నారు. ఏ అవసరం వచ్చిన నేనున్నానన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు.

## నీలంపాటి లక్ష్మీ అమ్మవారి 15వ వార్షికోత్సవంలో మార్కాపురం జనసేన ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్






(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మే 31)

తర్లుపాడు గ్రామం నందు శ్రీ నీలంపాటి లక్ష్మీ అమ్మవారి 15వ వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బండ లాగుడు పోటీలు, మార్కాపురం పట్టణం నందు సారిక రియల్ ఎస్టేట్ ఆఫీస్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మార్కాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్ హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు విజయరావు, నరసింహారావు, తర్లుపాడు మండల అధ్యక్షులు చేతుల శ్రీనివాసులు, ఖాన్, సునీల్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తాలూకా సీఐ విజయకృష్ణ హెచ్చరించారు. తాలూకా పరిధిలో అక్రమ ఇసుక రవాణా కార్యకలాపాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీని పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. అక్రమంగా ఇసుకను తరలించడం వల్ల నదులు, వాగులు, ఇతర జల వనరుల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిని గుర్తించి, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుంది. అక్రమ ఇసుక రవాణాకు ఉపయోగించే వాహనాలను సీజ్ చేయడంతో పాటు, నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుకను బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా వుంచడం జరుగు చున్నదన్నారు. ఉచిత ఇసుక పాలసీ విధానం అందుబాటులోకి వచ్చిన దృష్ట్యా ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే సంబంధిత వాహనాలను సీజ్ చేయడం, అరెస్ట్ చేయడం, మరలా మరలా పట్టుబడితే వారి పై పిడి యాక్ట్ పెట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అక్రమ ఇసుక రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు, డయల్ 112 కు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

## నెమలిదిన్నె చెన్నారెడ్డికి కీలక పదవి ఇచ్చిన వైసీపీ

### ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా –చెన్నారెడ్డి



(షణ్ముఖ వెలుగు, కంభం, మే 31)

మండలంలోని జంగంగుంట్ల గ్రామానికి చెందిన నెమలిదిన్నె చెన్నా రెడ్డిని వైసీపీ స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీగా నియమిస్తూ శుక్రవారం వైసీపీ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. చెన్నారెడ్డి గతంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు. తనకు ఈ పదవిని ఇచ్చినందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు చెన్నారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# విస్తృత ఉద్యోగ అవకాశాల్ని యువత అందిపుచ్చుకోవాలి

### వినుకొండలో నైపుణ్యాభివృద్ధి సంస్థ మెగా ఉద్యోగ మేళాకు విశేష స్పందన



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 31)

ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేటురంగంలోకి లభిస్తోన్న విస్తృత ఉద్యోగ అవకాశాల్ని యువత అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. కేవలం రూ.1200 జీతంతో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా ప్రారంభించి ఎదిగిన తన జీవిత ప్రస్థానమే అందుకు నిదర్శనమన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ జాబ్ మేళాకు 28 కంపెనీలు, 1666 మంది యువత హాజరు కాగా అందులో 521 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారందరికీ శుభాకాంక్షలు తెలిపిన చీఫ్‌విప్ జీవీ ఇష్టంతో ఎంచుకున్న ఉద్యోగాల్లో కష్టపడి పనిచేస్తే సాఫ్ట్‌వేర్‌ను మించిన జీతాలు కూడా సాధించే అవకాశాలు ఉంటాయన్నారు. తమ కంపెనీల్లోనే మార్కెటింగ్ విభాగంలో నెలకు రూ. లక్ష నుంచి రూ. 3లక్షల వరకు జీతాలు తీసుకుం టున్న ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. మార్కెటింగ్ రంగంలో విస్తృత అవకాశాలు ఉంటాయని, నేడు ప్రపంచంలో కంపెనీలకు సీఈవోలుగా ఉన్నవారిలో 65% ఈ విభాగం నుంచే వచ్చారన్నారు. తాను కూడా అలానే అంచెలంచెలుగా ఎదిగి శివశక్తి బయోను స్థాపించి, 15 రాష్ట్రాల్లో 5వేల మంది ఉద్యోగులతో వ్యాపారంలో ముందుకువెళ్తున్నా అన్నారు. ప్రస్తుతం తమ కంపెనీ రూ.1000కోట్ల టర్నోవర్‌కు చేరిందని, మూడేళ్లలో రూ. 2వేల కోట్లు, ఏడేళ్లలో 5వేల కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తమ అనుబంధ సంస్థలైన పుష్కళ్ అగ్రి టెక్, షణ్ముక్ అగ్రిటెక్‌లు కూడా వినుకొండ జాబ్ మేళాలలో పాల్గొన్నట్లు తెలిపారు. కష్టపడే వాళ్లు ఎప్పుడూ ముందుకు వెళ్తారని గుర్తు పెట్టుకోవాలని, ఇంటర్వ్యూలను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజి రావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అదనపు అధికారి రామాంజనేయులు, జిల్లా ఉద్యోగ కల్పనా అధికారి రవీంద్ర నాయక్, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన పింఛన్‌దారులకు ప్రతి నెల 1వ తేదీన పింఛన్

### ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

వృద్ధులు, వితంతువులు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అర్హులైన పింఛన్‌దారులకు ప్రతినెల 1వ తేదీన పింఛన్ అందజేయడం జరుగుతుందని, ఒకటి సెలవు దినం అయితే ఒకరోజు ముందుగానే లబ్ధిదారుని ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంపించారని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నగరంలోని 15వ డివిజన్ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మేయర్ గంగాడ సుజాతతో కలిసి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అందజేశారు. డివిజన్‌లోని లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్లి ఎంపీ మాగుంట స్వయంగా పింఛన్ నగదును అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికి ఇచ్చిన హామీ మేరకు హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలుచేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందించే తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు, 15 డివిజన్ కార్పొరేటర్ చింతపల్లి గోపి, నగర పార్టీ అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్షులు గడ్డం ఆదినారాయణ, బబ్లు, తాతా ప్రసాద్, సచివాలయ సిబ్బంది, మున్సిపల్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






## 27వ డివిజన్‌లో పెన్షన్ పంపిణీ చేసిన డివిజన్ అధ్యక్షుడు పప్పు శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా 27వ డివిజన్‌లో అధ్యక్షులు పప్పు శ్రీనివాసరావు పాల్గొని పెన్షన్ పంపిణీ చేశారు. అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ సెలవు దినాల్లో ఒకరోజు ముందే పెన్షన్ పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని పెన్షన్ దారులు ఆనందాన్ని వ్యక్తి పరుస్తున్నారని, గత ప్రభుత్వం ఇచ్చిన పెన్షన్ కంటే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెన్షన్ పెంచారని, అందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, డివిజన్లోని నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పాత పద్ధతిలో రేషన్ పంపిణీ

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 31)

నేటి నుంచి పాత పద్ధతిలో రేషన్ షాపు డీలర్ల ద్వారా నిత్యవసర వస్తువుల పంపిణీ చేయడం జరుగుతుందని తహశీల్దార్ టి శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి డీలరు వారికి కేటాయించిన ఇంటి నెంబర్ గల రేషన్ షాప్ నందు ప్రతి నెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిత్యవసర వస్తువులు సరఫరా చేయాలని తెలిపారు. 65 సంవత్సరాలు పైబడిన, ఇతర కుటుంబ సభ్యులు ఎవరు లేని కార్డుదారులకు, మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు వారి ఇంటి వద్దకు నిత్యవసర సరుకులు సంబంధిత డీలర్ ద్వారా సరఫరా చేయాలని సూచించారు. కావున ఈ అవకాశాన్ని మండలంలోని అందరు కార్డుదారులు ఉపయోగించుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

# అవ్వ, తాతల కళ్లల్లో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 31)

అవ్వ తాతల కళ్లల్లో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. వలేటివారిపాలెం మండలం చుండి పంచాయతీలోని కాకర్ల పాలెం గ్రామంలో ఇంటూరి నాగేశ్వరరావు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెన్షన్ లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్ డబ్బులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమంలో పింఛనుదారులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఒకటో తేదీ సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే పెన్షన్ల కోసం 34 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. పేదలకి ఎప్పటికప్పుడు పెన్షన్లు పెంచిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. ఏదైనా విపత్కర పరిస్థితుల్లో లబ్ధిదారులు ఒక నెలలో పెన్షన్ తీసుకోకపోయినా కానీ, తర్వాత నెలలో పెన్షన్ ఒకే సారి తీసుకునే అవకాశాన్ని కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కల్పించారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చటానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, త్వరలో చదువుకునే పిల్లలు ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి జూన్ 12న తల్లికి వందనం పథకం, అన్నదాత సుఖీభవ ఆగస్టు 15వ తేదీన మహిళలకు ఉచిత బస్సు పథకం వంటి పథకాలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించారని తెలిపారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం, 5 రూపాయలకే అన్నా క్యాంటీన్లో భోజనం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుపరుస్తుందని, నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీను కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుందని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెం మండలం ఎంపీడీవో నరేంద్ర వర్మ, మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాని హర్ష, గ్రామ పార్టీ నాయకులు నల్లబోతుల కొండలరావు, హరికృష్ణ, లక్ష్మి, బ్రహ్మయ్య, రమణయ్య, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.




On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com